క్లుప్తంగా

నేత్ర వైద్య శిబిరం



నెల్లూరు(బృందావనం): ఫతేఖాన్‌పేటలోని రైతుబజార్ సమీపంలో గల నిర్మల ఏజెన్సీస్‌లో ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని వాసన్ ఐ కేర్ సౌజన్యంతో సింహపురి వెల్ఫేర్ ఆర్గనైజేషన్ పర్యవేక్షణలో బుధవారం నిర్వహించారు. ఆర్గనైజేషన్ అధ్యక్షుడు నిర్మల నరసింహారెడ్డి, రమణారెడ్డి, డాక్టర్ బీవీ రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డ్రైవర్స్ డే



డ్రైవర్లపై పూలు జల్లుతున్న మురళీకృష్ణ

నెల్లూరు సిటీ: డ్రైవర్స్ డేను పురస్కరించుకొని నగరంలోని ఆర్టీసీ ఒకటో డిపోలో విధులు నిర్వర్తిస్తున్న డ్రైవర్లపై పూలు జల్లి అభినందనలను డిపో మేనేజర్ మురళీకృష్ణ తెలియజేశారు. ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంలో డ్రైవర్ల పాత్ర కీలకమని చెప్పారు.

- నగరంలోని పీఎస్సార్ బస్టాండ్‌లో డ్రైవర్లపై పూలు జల్లి అభినందనలను నెల్లూరు రెండో డిపో మేనేజర్ శివకేశవ్‌యాదవ్ తెలియజేశారు. అమరావతి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ సిబ్బందికి రెస్క్యూ డ్రస్ అందజేత



నెల్లూరు(క్రైమ్): నగరంలోని ఫైర్ స్టేషన్లో విధులు నిర్వర్తిస్తున్న 36 మంది సిబ్బందికి టీ షర్ట్, లోయర్‌తో కూడిన రెస్క్యూ డ్రస్‌ను ఏడీఎఫ్ఓ వేణుగోపాల్ తన సొంత నిధులతో సమకూర్చారు. రైల్వేఫీడర్స్ రోడ్డులోని నెల్లూరు అగ్నిమాపక కేంద్ర ఆవరణలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వీటిని సిబ్బందికి అందజేశారు. సహాయక చర్యల్లో పాల్గొనే సమయంలో డ్రస్ కోడ్‌ను విధిగా పాటించాలని సూచించారు.

శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు శ్రీకారం



నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని 34వ డివిజన్లో ముస్లిం శ్మశాన వాటిక అభివృద్ధికి తన సొంత నిధులు రూ.35 లక్షలను ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్ రెడ్డి కేటాయించారు. ఈ క్రమంలో పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. పార్టీ జిల్లా కార్యదర్శి రియాజ్, డీసీసీబీ డైరెక్టర్ కంతర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బాలికా దినోత్సవం



మాట్లాడుతున్న వాణి

నెల్లూరు (టౌన్): దర్గామిట్టలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీనియర్ సివిల్ జడ్జి వాణి హాజరయ్యారు. క్రీడలు, చిత్రలేఖన, పాటలు, వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్, ఏడీఎంహెచ్ఓ సలామ్, డీసీఎల్ఎం వెంకటేశ్వరరావు, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మాధవి, జీసీడీఓ మమత, డీఈఎంఓ శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిర్మయి, సీడీపీఓ అన్నపూర్ణ, రామారావు, కనకరత్నం, డీసీపీఓ సురేష్, నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అవగాహన



మాట్లాడుతున్న ప్రసన్నలక్ష్మి

నెల్లూరు (టౌన్): నెక్స్‌ప్లోరర్స్‌పై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమాన్ని నగరంలోని హోటల్ యష్‌లో నెల్లూరు స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డిప్యూటీ ఈఓ ప్రసన్నలక్ష్మి హాజరయ్యారు. అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుధీర్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు, స్మైల్ ఫౌండేషన్ కార్యనిర్వహణాధికారి కిషోర్, కో ఆర్డినేటర్ విజయసారథి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి



బ్యాటింగ్ చేసి.. పోటీలను ప్రారంభిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి
- ఆడుదాం.. ఆంధ్రా నియోజకవర్గ స్థాయి పోటీల ప్రారంభం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నియోజకవర్గ స్థాయి ఆడుదాం.. ఆంధ్రా పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. క్రికెట్ ఆడి.. క్రీడాకారులను పరిచయం చేసుకున్న అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాష్ట్ర క్రీడాకారులు రాణించాలనే సంకల్పంతో ఆడుదాం.. ఆంధ్రా పోటీలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని చెప్పారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, మేయర్ పొట్లూరు స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఆర్డీఓ మలోల, కమిషనర్ వికాస్ మర్మత్, డీఎస్డీఓ యతిరాజ్, ఏఎంసీ చైర్మన్ పేర్నేటి కోటేశ్వరరెడ్డి, పార్టీ డివిజన్ ఇన్‌చార్జి సన్నపురెడ్డి వెంకటసుబ్బారెడ్డి, ఎంపీడీఓ శైలేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేయాలి



మాట్లాడుతున్న హరినారాయణన్

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జగనన్న లే అవుట్ల రిజిస్ట్రేషన్లను గ్రామ సచివాలయాల్లో ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి ఐదు వరకు నిర్వహించాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. జగనన్నకు చెబుదాం, కులగణన సర్వే, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, జగనన్న లే అవుట్ల రిజిస్ట్రేషన్లు తదితర అంశాలపై జిల్లా అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్‌ను తిక్కన ప్రాంగణం నుంచి కలెక్టర్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామ సచివాలయాల్లో గ్రామ కార్యదర్శికి జాయింట్ సబ్ రిజిస్ట్రార్ హోదా కల్పిస్తూ రిజిస్ట్రేషన్లు చేసేలా ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసిందని వివరించారు. లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ తేదీని ముందుగానే తెలియజేసి గ్రామ సచివాలయాలకు తీసుకెళ్లాలని సూచించారు. డివిజన్ కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి ఎన్ని రిజిస్ట్రేషన్లు జరిగాయనే అంశమై నివేదికలను ఎప్పటికప్పుడు అందజేయాలని ఆదేశించారు. ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని వేగవంతం చేసి అందరికీ అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయుష్మాన్ భారత్‌పై ఎంపీడీఓలు శ్రద్ధ వహించాలన్నారు. పేదలకు ప్రభుత్వం అందిస్తున్న కార్యక్రమాలపై టెస్టిమోనియళ్లను ఈ నెల 31లోపు అప్‌లోడ్ చేయాలని వలంటీర్లకు సూచించారు. ఆడుదాం.. ఆంధ్రా జిల్లా స్థాయి పోటీలను ఈ నెల 31న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నారని, నియోజకవర్గ స్థాయి పోటీలను త్వరగా పూర్తి చేయాలన్నారు. జేసీ కూర్మనాథ్, డీఆర్వో లవన్న, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, డీపీఓ సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి అండగా..



ఎఫ్డీ బాండ్లను అందజేస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): కానిస్టేబుల్ మృతి చెందడంతో కుటుంబానికి సహచర కానిస్టేబుళ్లు అండగా నిలిచి ఆర్థిక చేయూతనందించారు. సంతపేట పోలీస్‌స్టేషన్లో విధులు నిర్వర్తిస్తున్న 2009 బ్యాచ్ కానిస్టేబుల్ రవి గతేడాది అకాల మరణం చెందారు. ఈ క్రమంలో ఆయన కుటుంబానికి ఆర్థిక చేయూతనందించేందుకు ఆ బ్యాచ్ కానిస్టేబుళ్లు ముందుకొచ్చారు. రూ.2.01 లక్షల మేర ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. దీనికి సంబంధించిన బాండ్లను రవి సతీమణి శిరీషకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ఏఎస్పీ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఆధునికీకరించిన కమిషనర్ చాంబర్ ప్రారంభం



పూజలు చేస్తున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆధునికీకరించిన కమిషనర్ చాంబర్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలను కమిషనర్ వికాస్ మర్మత్ నిర్వహించారు. అనంతరం కమిషనర్‌కు పలు విభాగాల ఉన్నతాధికారులు పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలను తెలిపారు. ఎస్ఈ సంపత్‌కుమార్, ఈఈ సంజయ్, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, సిటీ ప్లానర్ దేవీకుమారి, సెక్రటరీ హేమావతి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



మాట్లాడుతున్న చెన్నుడు

నెల్లూరు(బారకాసు): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల అమలుపై అవగాహన కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా సుభాష్‌చంద్రబోస్‌నగర్, కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు మాట్లాడారు. అర్హుల రిజిస్ట్రేషన్, ఆధార్ అప్‌డేట్, పీఎం స్వనిధి పథకం, ముద్ర లోన్, బ్యాంకుల ద్వారా అందుబాటులో ఉన్న రుణ సదుపాయాలు తదితర అంశాలపై అవగాహన కల్పించామని తెలిపారు. కర్నాటి ఆంజనేయరెడ్డి, సురేంద్రరెడ్డి, కందికట్ల రాజేశ్వరి, సుభాషిణి, నగరపాలక సంస్థ సెక్రటరీ హేమావతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



డీఆర్డీఏ పీడీకి వినతిపత్రమిస్తున్న వీఓఏలు

నెల్లూరు (పొగతోట): జిల్లాలో పనిచేస్తున్న వీఓఏల సమస్యలను పరిష్కరించాలని అసోసియేషన్ రాష్ట్ర నేత సంపూర్ణ కోరారు. వీఓఏల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ డీఆర్డీఏ కార్యాలయంలో పీడీ సాంబశివారెడ్డికి వినతిపత్రాన్ని బుధవారం అందజేసిన అనంతరం ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో 30 వేల మంది వీఓఏలుగా 18 ఏళ్లుగా పనిచేస్తున్నారని చెప్పారు. తమకు ఇన్సురెన్స్, హెచ్ఆర్ పాలసీ, కనీస వేతనం రూ.18 వేలు తదితరాలను కల్పించాలని కోరారు.

లంచం కేసులో ఉద్యోగికి మూడేళ్ల జైలు

నెల్లూరు(లీగల్): లంచం తీసుకున్నారని నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో కోవూరు కో ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ లిమిటెడ్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన శివరామయ్యకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానాను విధించారు. ఈ మేరకు నెల్లూరు ఏసీబీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సత్యవాణి బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. సాలుచింతల ప్రాంతంలో నివాసం ఉంటున్న ఇలియాజ్‌బాషా షుగర్ ఫ్యాక్టరీ లిమిటెడ్‌లో 1984 నుంచి పనిచేశారు. ఈయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. 2005లో స్వచ్ఛందంగా రిటైర్‌మెంట్ తీసుకున్నారు. 2012లో అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆయన సోదరి హుస్నారా బేగం తన వదిన జాకీరా బేగాన్ని 2013 మార్చిలో షుగర్ ఫ్యాక్టరీకి తీసుకెళ్లి ప్రభుత్వం నుంచి రావాల్సిన పెన్షన్, ఇతర బెనిఫిట్స్ కోసం దరఖాస్తు చేయించారు. ఈ విషయమై సంబంధిత సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ శివరామయ్యను హుస్నారా బేగం పలుమార్లు కలిసి దరఖాస్తును అధికారులకు పంపాలని కోరారు. 2013, సెప్టెంబర్ ఒకటో తేదీన ఆమె అప్లికేషన్ విషయమై అడగ్గా, అందుకు ఆయన రూ.ఐదు వేల లంచాన్ని డిమాండ చేశారు. ఈ మొత్తాన్ని ఇవ్వడం ఇష్టం లేని ఆమె అదే నెల ఐదున నెల్లూరు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఏడో తేదీ మధ్యాహ్నం ఫ్యాక్టరీలోని తన కార్యాలయంలో ఫిర్యాది నుంచి శివరామయ్య రూ.రెండు వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైమేరకు తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ త్రివేణి వాదించారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

నెల్లూరు(బారకాసు): అల్లీపురంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను బుధవారం పంపిణీ చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు జయవర్ధన్, నెల్లూరు పవన్‌కుమార్‌రెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డి, పాముూరు సుబ్బారావు, కంటేపల్లి బాలచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పింఛనర్ల సర్వసభ్య సమావేశం రేపు

నెల్లూరు(బృందావనం): భక్తవత్సలనగర్‌లోని పింఛనర్ల భవన్‌లో గణతంత్ర దినోత్సవం, పింఛనర్ల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నామని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్పెమ్ గౌస్, ఎస్వీపీఎస్ మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30కు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

మహా సుదర్శన హోమం నేడు

నెల్లూరు(బృందావనం): గురుపూర్ణిమను పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానంలో మహా సుదర్శన హోమాన్ని గురువారం ఉదయం తొమ్మిది గంటలకు నిర్వహించనున్నామని ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

వాకర్స్‌కు వైద్య పరీక్షలు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 300 మందికి బీపీ, షుగర్ పరీక్షలను ఆ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. దాతగా రామానాయుడు వ్యవహరించారు. అసోసియేషన్ కార్యదర్శి వెంకట సురేష్‌బాబు, అధ్యక్షుడు దాసరి అనంతరామారావు, ట్రెజరర్ అరిగెల సాయిరామ్, వాకర్స్ ఇంటర్నేషనల్ డిప్యూటీ గవర్నర్ కనకట్ల రఘురామ్ ముదిరాజ్, కిలారి తిరుపతినాయుడు, మాజీ అధ్యక్షుడు వేలూరి రంగారావు, వైస్ ప్రెసిడెంట్ తలారి సుధాకర్, డాక్టర్లు శ్రీనివాస్‌కుమార్, కృష్ణమూర్తి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): ఉపాధి నిమిత్తం నెల్లూరొచ్చిన ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల సమాచారం మేరకు.. మధ్యప్రదేశ్‌లోని సిద్ధి జిల్లాకు చెందిన రవి కుష్వా కొంతకాలంగా వనంతోపు సెంటర్‌లోని ఓ టీ దుకాణంలో టీ మాస్టర్‌గా పనిచేస్తున్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన రామకిశోర్ కుష్వా (23) ఉపాధి నిమిత్తం తొమ్మిది రోజుల క్రితం నెల్లూరొచ్చి రవికుష్వాను కలిశారు. తాను పనిచేస్తున్న టీ దుకాణంలోనే రామకిశోర్‌కు పని కల్పించి ఉమ్మారెడ్డిగుంటలోని తన గదిలో ఉండేందుకు అంగీకరించారు. ఈ నేపథ్యంలో తనకు నలతగా ఉందని.. కొద్దిసేపటి తర్వాత వస్తానని రామకిశోర్ చెప్పడంతో దుకాణానికి రవికుష్వా వెళ్లారు. ఈ తరుణంలో తలుపునకు గడియపెట్టి ఇనుపకొక్కికి వస్త్రంతో ఉరేసుకొని రామ్‌కిశోర్ కుష్వా ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎంతసేపటికీ షాపునకు రాకపోవడంతో గది వద్దకు వచ్చి తలుపులు తట్టగా లోపలి నుంచి అలికిడి రాలేదు. దీంతో తన యజమానికి తెలియజేశారు. అందరూ కలిసి తలుపులు పగలగొట్టి చూడగా రామకిశోర్ మృతి చెంది ఉన్నారు. ఈ మేరకు వేదాయపాళెం పోలీసులకు సమాచారం అందించారు.
ఎస్సై అంకమ్మ ఘటన స్థలాన్ని పరిశీలించి మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి



పార్టీలో చేరిన వారితో అనిల్‌కుమార్

- ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. నగరంలోని 39, 40వ డివిజన్లకు చెందిన టీడీపీ నేతలు మునిశేఖర్‌రెడ్డి, భరత్, మధు వారి మిత్రబృందం దాదాపు 75 మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో బుధవారం చేరారు. ఇస్కాన్ సిటీలోని తన నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి ఆకర్షితులై పార్టీలో చేరిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. నేతలు మానికల సునీల్, నూనె ప్రసాద్, నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు చాట్ల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

జంతు సంరక్షణ సామాజిక బాధ్యత



మాట్లాడుతున్న మహేశ్వరుడు

నెల్లూరు సెంట్రల్: జంతు సంక్షేమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించి.. మూగజీవాలను సంరక్షించాలని పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ మహేశ్వరుడు పేర్కొన్నారు. రైల్వేఫీడర్స్ రోడ్డులోని కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జంతు హింస నివారణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జంతు సంక్షేమ పక్షోత్సవాలను ఈ నెల 30 వరకు నిర్వహించనున్నామని చెప్పారు. పశువులను హింసించడం చట్టరీత్యా నేరమన్నారు. పశువులను సురక్షితంగా.. శ్వాస ఆడేలా ఉండే వాహనాల్లో మాత్రమే రవాణా చేయాలని ఆదేశించారు. పశువులను రోడ్లపైకి వదిలేయడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, పోషకులు తమ పశువులను తమ సంరక్షణలో ఉంచుకోవాలని సూచించారు. అనంతరం జంతు సంక్షేమ పక్షోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. కమిటీ సభ్యులు క్రైమ్స్ డీఎస్పీ శివాజీరాజా, డిప్యూటీ ఈఓ లక్ష్మి, ఎమ్వీఐ మురళీమోహన్, డాక్టర్లు మధులత, యశోద, జయచంద్ర, ఉమాదేవి, కణ్ణన్, మాలకొండయ్య, జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల కోసం పరీక్ష



ఉత్తీర్ణులైన వారితో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది

నెల్లూరు(బారకాసు): జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వర్తిస్తూ అర్హులైన వారికి పదోన్నతులు కల్పించేందుకు గానూ నడక పరీక్షను జిల్లా అటవీ అధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కొత్తూరు సమీపంలో నిర్వహించిన పరీక్షకు నలుగురు జూనియర్ అసిస్టెంట్లు హాజరయ్యారు. నాలుగు గంటల్లో 25 కిలోమీటర్ల మేర ఆగకుండా నడిచి వీరంతా ఉత్తీర్ణులయ్యారు. దీంతో చరణ్, లోకేష్, చంద్రశేఖర్, చక్రపాణికి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌గా పదోన్నతి కల్పించనున్నారు. నెల్లూరు ఫారెస్ట్ అధికారి మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధర్మప్రచార వారోత్సవాలు



పెద్దబజార్ సెంటర్‌లో రంగడి కల్యాణం



వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో మూలస్థానేశ్వరుడి కల్యాణం

నెల్లూరు(బృందావనం): ధర్మప్రచార వారోత్సవాలను దేవదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. పెద్దబజార్ సెంటర్‌లో రంగడి కల్యాణోత్సవాన్ని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థాన ఆధ్వర్యంలో నిర్వహించారు. భరతనాట్యం, కూచిపూడి నృత్యాలను మీనాక్షి నృత్యాలయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రదర్శించారు. ఈఓ డబ్బుగుంట వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

- మెక్లిన్స్ రోడ్డులోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థాన నిర్వాహకులు కందుకూరి చెంగయ్య ఆచారి దంపతులు, మూలస్థానేశ్వరాలయ ఈఓ ఆరంబాకం వేణుగోపాల్, ధర్మకర్తల మండలి చైర్మన్ లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గౌరీశంకర్‌కు పురస్కార ప్రదానం



నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ చాగణం గౌరీశంకర్‌కు సేవారత్న బిరుదు, లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా 25 కళా సంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి మాట్లాడారు. పెళ్లకూరులో ఎనిమిదెకరాల విస్తీర్ణంలో చాగణం ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి 14 ఏళ్లుగా ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న గౌరీశంకర్ దంపతులను సత్కరించి.. పురస్కారాలను ప్రదానం చేయడం ఆనందంగా ఉందని చెప్పారు. డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, ఏడీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ, రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోటిరెడ్డి, చిట్టమూరుకు చెందిన రాఘవేంద్రరావు, చాగణం ట్రస్ట్ సీఈఓ సీతారామనాయుడు, ఏఓ కృష్ణ, కళాసంఘాల కన్వీనర్లు దోర్నాల హరిబాబు, అమీర్‌జాన్, నేదురుమల్లి హరనాథ్‌రెడ్డి, కోసూరు రత్నం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.